ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- జగనన్న విద్యా కానుకల పంపిణీ


ఎన్జీజీవోస్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రావణి


మధురానగర్ హైస్కూల్‌లో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న కె.కె.రాజు, సారిపిల్లి గోవింద్

సీతంపేట: ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ముఖ్య అతిథిగా ఆయన విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులందరినీ తన కుటుంబ సభ్యులుగా భావించి వారికి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ అనేక రకాలుగా తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకుని విద్యలో ఉన్నతంగా రాణించాలని కె.కె.రాజు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతికుమారి, బి.దేముడుబాబు, స్థానిక నాయకులు భోగవిల్లి గోవింద్, పోతుబంతి హరికృష్ణ, సన్నీ, ముద్దాడ అశోక్, విద్యా కమిటీ చైర్మన్ బి.నాగమణి, ఉపాధ్యాయ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

26వ వార్డులో..

26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేటర్ ముక్కా శ్రావణి జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలను, తోడ్పాటును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనరస, పద్మజారాణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంకు విద్యార్థుల తల్లిదండ్రుల కృతజ్ఞతలు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ముఖ్య అతిథి కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేశారన్నారు. పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేసిన జగనన్నకు విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దొరబాబు, ఉపాధ్యాయులు సూర్యప్రభ, వార్డు నాయకులు సుకుమార్, కృపా, కనకరాజు, గురువోజీ, రమేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.


రాంజీ ఎస్టేట్ పాఠశాలలో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ కామేశ్వరి

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'ఆటాపాట–విద్య'


తారకరామానగర్‌లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలతో అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది


తులసీపేటలో చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్లు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తారకరామానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో జన భాగిదరి కార్యక్రమంలో భాగంగా బుధవారం అంగన్‌వాడీ విద్య–ఆటాపాటల కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో కుమారి, శ్రీలత, సూపర్‌వైజర్ జ్యోతిల ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో మూడేళ్లు నిండిన పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిచాలని సిబ్బంది తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిపట్నాయక్ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. వారి ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్నివేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయని, ప్రతి తల్లి అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎస్.సుజాత, సచివాలయ మహిళా పోలీసులు సువర్చల, అనిత, సునీత, సంధ్య, సూర్యకుమారి, వెల్ఫేర్ సెక్రటరీ లక్ష్మీదేవి, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పిల్లలకు నచ్చేలా విద్యా బోధన

సీతమ్మధార: పిల్లల పురోభివృద్ధిని మూడు నెలలకు ఒకసారి చైల్డ్ అసెస్మెంట్ రిపోర్టు కార్డు ద్వారా అంచనా వేస్తున్నట్లు సూపర్‌వైజర్ వి.ఇందిరా తెలిపారు. 24వ వార్డు తులసీపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జన్ భాగిదరిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో మొదటి ఆరేళ్లు అత్యంత విలువైనవన్నారు. మూడేళ్ల వరకు తల్లి ఒడికి, ఇంటికి పరిమితమైన పిల్లలు బయట ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం మొదలు పెడతారని చెప్పారు. పిల్లలకు ఇష్టమైన ఆట, కథల ద్వారా వారి మనస్సును హత్తుకునేలా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా విద్యను అందిస్తామని చెప్పారు. ప్రాథమిక స్థాయిలోనే కాకుండా ఉన్నత స్థాయిలో కూడా విద్యా ప్రమాణాలు అందుకునేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రంలో ఆట, పాటలతోపాటు పరిజ్ఞానం అందేలా పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ గౌరి, ట్రైనీ జి.లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.


జాషువానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శశికళ

'జన్ భాగిదరి'లో చిన్నారుల భాగస్వామ్యం

కంచరపాలెం: జన్ భాగిదరి కార్యక్రమంలో చిన్నారులను భాగస్వామ్యం చేసేలా ప్రోత్సహించాలని 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ పిలుపునిచ్చారు. వార్డులోని జాషువానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జన్ భాగిదరి కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఫోర్ డెవలప్‌మెంట్ కార్నర్స్ ఏర్పాటు చేసి చిన్నారులకు పౌష్టికాహారంతో పాటుగా ఆట–పాటలతో కూడిన విద్యను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారి ఇందిర, నాయకులు ధర్మేంద్రరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దివాకర్ రెడ్డి, సూర్రెడ్డి, వీరారెడ్డి, జాషువానగర్, ధర్మానగర్, అశోక్‌నగర్, రెడ్డికంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు, సచివాలయ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతుబజార్ స్టాళ్లకు డ్రా


రైతులకు స్టాల్ టోకెన్లు అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు సోమవారం ఈవో కొండబాబు డ్రా తీసి రైతులకు వాటి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి బుధవారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

43వ వార్డులో సోలార్ వెలుగులు


జగ్గారావు బ్రిడ్జి వద్ద సోలార్ లైటును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డులో సోలార్ వెలుగులు విరజిమ్మాయి. వార్డుకు రెండు సోలార్ వీధిలైట్లు మంజూరయ్యాయి. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సూచనల మేరకు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో 80 ఫీట్ రోడ్, జగ్గారావు బ్రిడ్జి ప్రాంతాల్లో వాటిని ఏర్పాటు చేశారు. బుధవారం ఈ సోలార్ లైట్లను కార్పొరేటర్ ఉషశ్రీ ప్రారంభించారు. విద్యుత్‌ను ఆదా చేసేందుకు సుమారు రూ.60 వేల జీవీఎంసీ నిధులతో, 20 వాట్స్ గల సోలార్ వీధి లైట్లు వార్డులో అమర్చినట్లు ఆమె తెలిపారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ


ముస్లిం తాటిచెట్లపాలెంలో అత్యవసరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఏపీఈపీడీసీఎల్ అక్కయ్యపాలెం సెక్షన్ పరిధి ముస్లిం తాటిచెట్లపాలెంలోని ఎస్ఎస్ 53 160 కేవీఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్‌పై అత్యధిక విద్యుత్ వినియోగం భారం పడటంతో బుధవారం అనేక సార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడ్డాయి. నగరంలో ఇటీవల పెరుగుతున్న అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా విద్యుత్ వినియోగం పెరగడంతో ఈ సమస్య తలెత్తినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. సమస్యను గుర్తించిన విద్యుత్ శాఖ సిబ్బంది జోన్–1 ఆపరేషన్స్ ఈఈ జి సత్యనారాయణ ఆదేశాలతో సిబ్బంది అత్యవసరంగా ముస్లిం తాటిచెట్లపాలెంలో మరో 100కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అదనంగా ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఏపీ ఈఏపీసెట్‌లో 'శ్రీవిశ్వ'కు ర్యాంకులు

సీతంపేట: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. సిహెచ్.సాయి రుషిత 22వ ర్యాంకు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. జి.శ్రీదేవి 321, డి.వెంజా 374, ఆర్.కరిష్మా సుమనజల 379, ఎం.జాహ్నవి 389, డి.శ్రీలేఖ 412, ఆర్.జ్యోత్స్న 430, సిహెచ్.సుధీర్‌బాబు 468, కె.ఉజ్వల్ సాయిశ్రీ 495 ర్యాంకులు సాధించారు. వందలోపు ఒకటి.. 500 లోపు 9.. వెయ్యిలోపు 16 ర్యాంకులు వచ్చాయి. వీరిని శ్రీవిశ్వ విద్యాసంస్థల చైర్మన్ ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ అభినందించారు.

నీట్‌లో..

శ్రీవిశ్వ కళాశాల విద్యార్థులు సిహెచ్.సాయి రుషిత 812, కె.లోచన్ సాయి 873 ర్యాంకులు సాధించారు. జాతీయ స్థాయిలో వెయ్యి లోపు 2, ఐదువేల లోపు ఆరు ర్యాంకులు వచ్చాయి.

పైడి రమణ బాధ్యతల స్వీకరణ


పైడి రమణను అభినందిస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు, జీఎం మల్లికార్జున

తాటిచెట్లపాలెం: రాష్ట్ర ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ జనరల్ మేనేజర్ వై.మల్లికార్జున పైడి రమణతో ప్రమాణ స్వీకారం చేయించారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు, అభిమానులు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంగా పైడి రమణ మాట్లాడుతూ తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఈ పదవికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు, కార్పొరేటర్ కంపా హనోకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కొత్త డస్ట్ బిన్ ఏర్పాటు


పోర్టు క్వార్టర్స్ ప్రాంతంలో జీవీఎంసీ ఏర్పాటు చేసిన కొత్త డస్ట్ బిన్

సాక్షి ఎఫెక్ట్..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురం పోర్టు క్వార్టర్స్ ప్రాంతంలో శిథిలమై, బోర్లా పడి ఉన్న డంపర్ బిన్‌ను సరిచేశారు. దీప్ భవన్ ఎదురుగా ఏర్పాటు చేసిన డస్ట్ బిన్ దుస్థితిపై బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ సిబ్బంది తక్షణం స్పందించారు. శిథిల డస్ట్ బిన్‌ను తొలగించి, అక్కడ కొత్తది ఏర్పాటు చేశారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

హెల్త్ సూపర్‌వైజర్లకు ఆత్మీయ వీడ్కోలు


ఉద్యోగులను సత్కరిస్తున్న డీఎంవో మణి, నగేష్ పట్నాయక్

సీతంపేట: నగరంలోని జిల్లా మలేరియా సబ్ యూనిట్ నుంచి విజయనగరం జిల్లాకు బదిలీపై వెళ్లిన ముగ్గురు హెల్త్ సూపర్‌వైజర్లకు సహోద్యోగులు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. జిల్లా మలేరియా అధికారి కార్యాలయంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి జిల్లా మలేరియా అధికారి(డీఎంవో) వై.మణి మాట్లాడుతూ సూపర్‌వైజర్లు కె.వెంకటరావు, ఆర్.వి.లోకనాథం, బి.ఎస్.వర్ధన్ సబ్‌యూనిట్‌లో మంచి సేవలు అందించారని, భవిష్యత్‌లో కూడా అదేవిధంగా సేవలందించాలని కోరారు. అనంతరం వారిని దుశ్శాలువాతో సత్కరించి, బహుమతులు అందజేశారు. విజయనగరం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన మరో ముగ్గురు సూపర్ వైజర్లు సత్యానందం, జి.వి.రవికుమార్, రామి నాయుడులకు సాదరంగా ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు బి.కుమార్, రత్నం, మహందాత, రామకోటి, కుమార్, హెల్త్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

మహారాణిపేట: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇసుకతోట అర్బన్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. దీని వల్ల మరొకరి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. వైద్య ఆరోగ్యశాఖ వైద్యుడు డాక్టర్ రమారెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబె

తాటిచెట్లపాలెం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం పోర్టు గోల్డెన్ జూబిలీ హాస్పిటల్‌లో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రక్తదాత్ అమృత్ మహోత్సవ్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథి పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన ఆవశ్యకతను వివరించారు. రక్తదానం చేయడం వల్ల అత్యవసర సమయాల్లో కొందరి ప్రాణాలను రక్షించిన వారమవుతామని పేర్కొన్నారు. శిబిరంలో రక్తదాతలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా తరచూ రక్తదానం చేసే వారిని గుర్తించి పోర్టు అధికారులు ఘనంగా సత్కరించారు. పోర్టులోని అన్ని విభాగాల సిబ్బంది రక్తదానంపై ప్రమాణం చేశారు. 35 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో పోర్టు చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషాదేవి, విభాగాధిపతులు, సీఐఎస్ఎఫ్ కమాండెంట్, గోల్డెన్ జూబిలీ హాస్పిటల్ సిబ్బంది, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అంబేద్కర్ నగర్‌లో పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ కామేశ్వరి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు అంబేద్కర్ నగర్, బాపూజీనగర్ కొండవాలు ప్రాంతాల్లో బుధవారం అభివృద్ధి పనులకు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరితో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. సుమారు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, మెట్ల మార్గాలకు మరమ్మతులు, డ్రెయిన్ల పనులు చేపట్టనున్నట్లు జోన్–5 ఏఈ అర్చన తెలిపారు. నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించినట్లు కె.కె.రాజు చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొల్లాబత్తుల వెంగళరావు, వార్డు నాయకులు వసంతల అప్పారావు, వీర రాఘవులు, విజయ్, సురేష్, కనకరాజు, చందురెడ్డి, భోగి, ముక్క రమణ, గోవింద్, నరసింగ్, గురువోజీ, అప్పన్న దొర, లక్ష్మణ్‌సాయి, అనిల్‌కుమార్, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ప్రచార రథం ప్రారంభం

అల్లిపురం: టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 30వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో స్వామి ప్రచార రథాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఆలయ ఈవో రాజగోపాలరెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులు, ఆలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు మారోజు శ్రీనివాస్, కంటుముచ్చు సాగర్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మురళీనగర్: మద్రిపాలెం సెక్షన్ పరిధిలోని 104 ఏరియా, బాపూజీనగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐటీఐ కూడలి, సిద్ధార్థనగర్, 104 ఏరియా, శ్యామ్ నగర్ కాలనీ, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్, గణేష్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందేలా కార్యక్రమాలు


విజేతలతో పీలా వెంకటలక్ష్మి, నాగమల్లేశ్వరి

సీతంపేట: న్యూ హోప్ ఫౌండేషన్ ద్వారా డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి సామాజిక సేవా కార్యక్రమాలు, చేనేత కార్మికులకు చేయూత ఇస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర మహిళా విభాగం ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి అన్నారు. ఫౌండేషన్ నిర్వహించిన మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్రా–2023 ఫైనల్స్ విజయవంతమైన నేపథ్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందిస్తాయన్నారు. ఫైనల్స్ విజేతలైన మిసెస్ ఉత్తరాంధ్రా 2023 సరళ, మిస్ ఉత్తరాంధ్రా 2023 శ్రీయలను అభినందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మంచా నాగమల్లేశ్వరి మాట్లాడుతూ 60 రోజుల పాటు జరిగిన ఈ పోటీలకు సహరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు సాహిత్యానికి ప్రాణం మహాభారతం



మాట్లాడుతున్న వెంకట సత్యనారాయణ

సీతంపేట: ఆంధ్ర మహాభారతం తెలుగు సాహిత్యానికి ప్రాణమని, తెలుగు వారికి అమర కావ్యమని సాహితీవేత్త కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణ అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో 'కవిత్రయం–రచనా వైశిష్ట్యం' అనే అంశంపై జరిగిన సాహిత్య సభలో ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించారు. మహాభారతం కవిత్రయం వల్లే జనబాహుళ్యమైనదని తెలిపారు. తెలుగు సాహిత్యంలో కవిత్రయంగా ప్రసిద్ధులైన నన్నయ్య, తిక్కన్న, ఎర్రన్నలకు ఉన్న స్థానం అనన్యమైనదన్నారు. ముగ్గురూ మూడు సాహిత్య యుగాలకు యుగకర్తలుగా భావింపబడుతున్నారని పేర్కొన్నారు. తిక్కన్న చిత్రించిన యుద్ధ ఘట్టాలను చదువుతుంటే మహాభారత యుద్ధాన్ని సినిమా తెరకు ఎక్కించే ప్రయత్నం ఎవరూ పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. మహాభారతం లోతు తెలుగు సినిమా దర్శకులకు అంతుబట్టలేదన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మహాభారతంలో లక్షకు పైగా శ్లోకాలు 18 పర్వాల్లో ఉన్నాయన్నారు. భారతం ద్వారా భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రాలు లభించాయన్నారు. రచయిత డి.వి.సూర్యారావు మాట్లాడుతూ మహాభారతం ఆది కావ్యమని, తెలుగు వారి ఇళ్లల్లో ఉండవలసిన గ్రంథమని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణ మూర్తి, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, బి.రాధారాణి, కొత్తూరి రమణ పాల్గొన్నారు.

అంధకారంతో రాకపోకలకు ఇబ్బందులు


అంధకారంలో సంఘం ఆఫీస్ రోడ్

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు సంఘం ఆఫీస్ కూడలి నుంచి జగన్నాథపురం శ్మశానవాటికకు వెళ్లే రోడ్డులో అంధకారం అలుముకుంది. కొద్ది రోజులుగా ఈ మార్గంలో వీధిలైట్లు వెలగక నివాసులు అవస్థలు పడుతున్నారు. చీకటి పడ్డాక పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల హెడ్‌లైట్ల వెలుగులోనే ప్రయాణిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలి.

– జి.పూర్ణచంద్రరావు,
జగన్నాథపురం, అక్కయ్యపాలెం

జోరువానతో ఉపశమనం


అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో కూలిన వృక్షం

సీతంపేట: గత నెల రోజులుగా భగభగలాడుతున్న సూర్యప్రతాపం నుంచి ఉపశమనం కలిగేలా జోరువాన పలకరించింది. మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదుతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. బుధవారం సాయంత్రం అనుకోని అతిథిలా వచ్చిన వర్షం నగరవాసికి కాస్త ఉపశమనం కలిగించింది. పగలంతా ఎండకాసినా.. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని ఆకాశం మేఘావృతమై జోరుగా వాన కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారింది. సుమారు గంట సేపు కురిసిన వానకు రహదారులు జలమయమయ్యాయి. వర్షం దాటికి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని అపోలో ఫార్మసీ వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు. వర్షం కారణంగా వ్యాపారాలకు ఇబ్బంది కలగడంతో సీతంపేట మెయిన్ రోడ్, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ ప్రాంతాల్లో చిరువ్యాపారులు ఉసూరుమన్నారు. పనులపై బయటకు వచ్చిన వాహన చోదకులు, పాదచారులు వర్షంతో ఇబ్బందులకు గురయ్యారు.

విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: విద్యార్థినులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు సూచించారు. ద్వారకానగర్ బీవీకే కళాశాలలో బుధవారం విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దిశ యాప్‌ను స్టూడెంట్లతో డౌన్‌లోడ్ చేయించారు. అత్యవసర సమయంలో మహిళల భద్రతకు దిశ యాప్ ఉపయోగపడుతుందని సీఐ అన్నారు.